

## 17 మందికి లివింగ్ హెరిటేజ్ అవార్డులు

**విజయవాడ, ఏప్రిల్, 18,(మనం న్యూస్):** శనివారం ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో సాంస్కృతిక వారసత్వాన్ని సంగీతంతో సెలబ్రేట్ చేసే హెరిటేజ్ హార్మోనీ కార్యక్రమంలో మొత్తం 17 మందికి లివింగ్ హెరిటేజ్ అవార్డులు ప్రదానం చేశారు. క్రీడలు, యోగా, ధార్మికత, వైద్యం, వ్యవసాయం, తెలుగు సాహిత్యం, సంగీతం తదితర రంగాల్లో మన ఘన వారసత్వానికి ప్రతీకలుగా నిలిచిన విశిష్ట వ్యక్తులకు లివింగ్ హెరిటేజ్ అవార్డులు ప్రదానం చేశారు.

# అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాల నిరోధానికి పటిష్ట చర్యలు

### విశాఖపట్నం జిల్లా యంత్రాంగం అప్రమత్తం.

### బాల్య వివాహాల నిరోధానికి కఠిన చర్యలు

### విశాఖపట్నం జిల్లా యంత్రాంగం హెచ్చరిక

**విశాఖపట్టణం, ఏప్రిల్ 18 :** మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి. రామలక్ష్మి వారి పర్యవేక్షణలో అక్షయ తృతీయ సందర్భంగా ఈ రోజు శంకరమఠం, కళ్యాణమండపాలు, లలితాదేవి ఆలయం మరియు అక్కయ్యపాలెం ప్రాంతంలోని వివాహ మండపాలలో పూజారులు మరియు ఆలయ సిబ్బందికి బాల్య వివాహ నిరోధక చట్టం-2006పై అవగాహన కార్యక్రమం నిర్వహిం చబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి కె. హరి కృష్ణ పాల్గొని, బాల్య వివాహాల చట్టపరమైన నిబంధనలు, వాటి దుష్ప్రభావాలు వివరించారు. అలాగే ప్రజల్లో అవగాహన పెంచేందుకు పాంప్లెట్లు ముద్రించి ఆయా ప్రదేశాలలో గోడలపై అతికించడం జరిగింది, బాల్య వివాహాలపై స్లోగన్లు ప్రదర్శించచడం జరిగింది. అనంతరం కంచరపాలెం పరిధిలోని కప్పరాడ ఆంగన్వాడీ కేంద్రంలో మరియు కమ్యూనిటీ హాల్లో అక్షయ తృతీయ సందర్భంగా కళాజాథా నిర్వహకులచే బాల్య వివాహాలపై చట్టపరమైన నిబంధనలు, శిక్షలు మరియు వాటి దుష్ప్రభావాల గురించి వివరంగా తెలియజేయబడింది. అలాగే బాల్య వివాహాలను నిరోధించడంలో సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతను తెలియజేస్తూ నాటకాలు ప్రదర్శించబడినవి. పోషణ పక్వాడా సందర్భంగా పిల్లలను మొబైల్ ఫోన్ల నుండి దూరంగా ఉంచి వారి భవిష్యత్తుకు పునాది వేయాలని, పోషకాహారం ద్వారా పిల్లల ఎదుగుదల మరియు శారీరక అభివృద్ధికి దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ జేటీఎస్ జ్యోతి (మర్రిపాలెం సెక్టార్), ఐసీపీఎస్ నుండి ఎల్సీపీఓ ఐ. అనిజా కుమారి, చైల్ హెల్ప్లైన్ కేస్ వర్కర్ పి. అంబేద్కర్, అవుట్రీచ్ వర్కర్ ఆర్. సాయి కుమారి,ఆంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, తల్లులు, కిశోర



బాలికలు, పిల్లలు మరియు కళాజాథా సిబ్బందిపాల్గొన్నారు.'బాల్య వివాహ ముక్త భారత్' లక్ష్యంగా, జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ వారి ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న బాల్య వివాహ నిషేధ చట్టం, 2006 ప్రకారం జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేయనున్నారు. అక్షయ తృతీయ పర్వదినాలను పురస్కరించుకుని జిల్లాలో బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉన్నందున, ప్రాజెక్ట్ డైరెక్టర్ గారి ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం (–CPU) మరియు చైల్ హెల్ప్ లైన్ (CHL 1098) సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

# చందనోత్సవానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

### బాంబ్ డిస్పోజల్, క్యూఆర్టీ సిబ్బందికి సిపి మార్గ నిర్దేశం




**విశాఖ క్రైమ్, ఏప్రిల్ 18(మనం న్యూస్):** ఈ నెల 20వ తేదీన జరగనున్న శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి చందనోత్సవం నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై నగర పోలీసు విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సందర్భంగా విధుల్లో పాల్గొననున్న బాంబ్ డిస్పోజల్ టీం సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ముఖ్య సూచనలు అందించారు. సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గమనించిన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులతో మర్యాదపూర్వకంగా, సహనంతో ప్రవర్తిస్తూ సేవాభావంతో పని చేయాలని తెలిపారు. భారీగా భక్తులు హాజరయ్యే అవకాశమున్నందున భద్రతా పరంగా ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో విశాఖపట్నం సిటీ పోలీస్ బాంబ్ డిస్పోజల్ టీంతో పాటు శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన బృందాలు కూడా పాల్గొన్నాయి. భద్రతా చర్యలను సమన్వయంతో నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, ఇదే సమావేశంలో విశాఖపట్నం సిటీ పోలీస్కు చెందిన క్విక్ రియాక్షన్ టీం సిబ్బందికి డ్రెస్ కోడ్ కిట్లను పోలీస్ కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా క్యూఆర్టీ సిబ్బంది మరింత అంకిత భావంతో, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు అధికారులు, వివిధ జిల్లాలకు చెందిన బాంబ్ డిస్పోజల్ మరియు క్యూఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు. భద్రతా చర్యల పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు.

# కమనీయం... కన్నుల పండుగగా కొండపల్లి బొమ్మల ఉత్సవం

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 18,(మనం న్యూస్):** కొండపల్లి బొమ్మల పండుగ కమనీయం కన్నుల పండుగలా సాగుతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కొండపల్లి ఉత్సవాల్లో భాగంగా బొమ్మల పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంపాల సీతారామయ్య మాట్లాడుతూ, కవి సమ్మేళనం, తోలుబొమ్మలాట, కీలుగుఱ్ఱం, జానపద నృత్యాలు




మన సంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉండటం ఆనందదాయకమని తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన కొండపల్లి బొమ్మలకు అంతర్జాతీయ గుర్తింపు ఉందని, వాటిని నేటి తరాలకు చేరవేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అనంతరం నృత్య ప్రదర్శనలు చేసిన కళాకారులను ఆయన సత్కరించి, కొండపల్లి బొమ్మలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అక్కల గాంధీ, చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.



## విశాఖ ట్రాఫిక్ ఏసీపీగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

**విశాఖ క్రైమ్, ఏప్రిల్ 18(మనం న్యూస్):** విశాఖపట్నం నగర ట్రాఫిక్ సహాయ పోలీసు కమిషనర్గా మహాదాస్యం శ్రీనివాసరావు ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. 1991 ఎస్ఐ బ్యాచ్కు చెందిన ఆయన ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో అధికారికంగా శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు విజయనగరం ఎస్డీపీఓగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు, బదిలీపై విశాఖపట్నం నగరానికి వచ్చారు. నగరంలో ఇప్పటికే మధురవాడ ఏసీపీగా సమర్థవంతంగా సేవలందించిన అనుభవం ఆయనకు ఉంది. అలాగే టూ టౌన్, గాజువాక, పీఎం పాలెం పోలీసు స్టేషన్లలో ట్రాఫిక్ ఎస్ఐగా, పీఎం పాలెం స్టేషన్లో ట్రాఫిక్ సీఐగా కూడా పనిచేశారు. పలు కీలక బాధ్యతలు నిర్వర్తించిన అనుభవంతో నగర ట్రాఫిక్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తారనే నమ్మకాన్ని నగర పోలీసు వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా నగర పోలీసు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.



# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి

### టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

**అమరావతి, ఏప్రిల్ 18:** ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారు వైద్యుల సలహా మేరకు చికిత్స పొందిన నేపథ్యంలో త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే శ్రీ పల్లా శ్రీనివాసరావు గారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా సేవ పట్ల అంకితభావంతో రాష్ట్ర అభివృద్ధి-ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పవన్ కళ్యాణ్ గారు వైద్యుల సూచనలను కచ్చితంగా పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటూ త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలోకి వచ్చి తన బాధ్యతలను యథావిధిగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఆయన మరింత ఉత్సాహంతో సేవలందించాలని, ఆయనకు దేవుని ఆశీస్సులు లభించి త్వరగా కోలుకుని ప్రజలకు అందుబాటులోకి రావాలని పల్లా శ్రీనివాసరావు కోరారు.

# ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్కు ఐఎస్వో కీర్తి కిరీటం

### మూడు సర్టిఫికేట్లు కైవసం చేసుకున్న కలెక్టరేట్.

### అత్యుత్తమ ప్రమాణాలు పాటించిన 9 పంచాయతీలకు కూడా ఐఎస్వో సర్టిఫికెట్లు



**(విజయవాడ,ఏప్రిల్,18,మనం బ్యూరో):** ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్కు ప్రతిష్టాత్మకమైన ఐఎస్వో సర్టిఫికేషన్లు లభించాయి. పరిపాలనా వ్యవస్థలో నాణ్యతా ప్రమాణాలు, పారదర్శకత, ప్రజా సేవల మెరుగుదలలో తీసుకున్న చర్యలకు గుర్తింపుగా మూడు ఐఎస్వో సర్టిఫికేట్లు కలెక్టరేట్కు అందాయి. ఇంధన పొదుపు విధానాలు, హరిత, పర్యావరణ హిత ప్రోత్సాహక కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో సత్వర స్పందన, సంక్షేమ పథకాల అమలు తదితరాల్లో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలకుగాను ఈ సర్టిఫికెట్లు లభించాయి. ఐఎస్వో 50001: 2018, ఐఎస్వో 14001:2015, ఐఎస్వో 9001:2015 సర్టిఫికెట్లు లభించాయి.
ప్రత్యేకంగా ఇంధన పొదుపు విధానాల అమలు, కార్యాలయాల్లో విద్యుత్ వినియోగ నియంత్రణ, హరిత-పర్యావరణ హిత కార్యక్రమాల ప్రోత్సాహం, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పరిశుభ్రత పరిరక్షణ వంటి అంశాల్లో కలెక్టరేట్ విశిష్ట ప్రదర్శన కనబర్చింది. అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కారంలో సత్వర స్పందన, ప్రజలతో నేరుగా సంప్రదింపులు, అర్జీల పరిష్కార వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందింది. ఇక సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, అర్హులకు లబ్ధి చేరేలా తీసుకున్న చర్యలు, డిజిటల్ విధానాల వినియోగం, సేవల సరళీకరణ వంటి అంశాలు కూడా ఈ సర్టిఫికేషన్లకు దోహదపడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఐఎస్వో సర్టిఫికేషన్లు సాధించడం కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది సమిష్టి కృషికి ఫలితమని పేర్కొన్నారు. ఇది గర్వకారణమే కాకుండా మరింత బాధ్యతను కూడా పెంచుతుందని తెలిపారు. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించేందుకు, ప్రజలకు వేగవంతమైన, పారదర్శక పరిపాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. జిల్లా పరిపాలనలో నాణ్యతా ప్రమాణాలను నిరంతరం పెంపొందిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలను మరింత మెరుగుపరచడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.




## విద్యా బోధనలో అత్యుత్తమ క్వాలిటీ సర్టిఫికెట్ అందుకున్న సిబార్

### హైమ్ ఇంటర్నేషనల్ సంస్థ సీఈవో శివయ్య

**గుంటూరు/పెదకాకాని ఏప్రిల్ 18(మనం న్యూస్ ప్రతినిధి):** రెండు తెలుగు రాష్ట్రాలలో విద్యాబోదంలో అత్యుత్తమ క్వాలిటీ సర్టిఫికెట్ అందుకున్న సిబార్ దంత వైద్య కళాశాలని హైమ్ ఇంటర్నేషనల్ సంస్థ సీఈవో శివయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని సిబార్ దంత వైద్య కళాశాలకు దంత వైద్య రంగంలో అత్యుత్తమ ప్రమాణాలతో విద్యా బోధన అందిస్తున్నందుకు హైమ్ ఇంటర్నేషనల్ వారు ఫైవ్ స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికెట్ ను సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ లింగమనేని కృష్ణ ప్రసాద్ కు అందజేశారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ దంత వైద్య రంగంలో అత్యుత్తమ వైద్య ప్రమాణాలు పాటిస్తూ ఎందరో ప్రతిభ కలిగిన వైద్యులను సిబార్ తయారు చేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# చందనోత్సవానికి సర్వం సిద్ధం

### శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి చందనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

### భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు: కలెక్టర్ అభిషిక్త్ కిషోర్




**విశాఖపట్నం/సింహాచలం.ఏప్రిల్ 18:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి అత్యంత ప్రతిష్టాత్మకమైన చందనోత్సవం వేడుకలకు జిల్లా యంత్రాంగం, దేవస్థానం మరియు పోలీస్ శాఖ సంయుక్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ వెల్లడించారు. శనివారం సాయంత్రం ఆయన సింహాచలం దేవస్థానం లో చందనోత్సవం ఏర్పాట్లను ఎండో కమిషనర్, జాయింట్ కలెక్టర్ ఉద్యాధరీ , జీవీఎంసీ కమిషనర్ తేజ్ భరత్,ఈవో ఒ. వెంకట రావు తో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ ఈ ఏడాది సుమారు రెండు లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

చందనోత్సవం రోజున తెల్లవారుజామున 4 గంటలకు తొలి పూజ అనంతరం భక్తులకు దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం 6:00 గంటల కల్లా దర్శనాల ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ఆన్లైన్ ద్వారా ₹300, ₹1000 మరియు ₹1500 కేటగిరీలలో సుమారు 40,000 టికెట్లను విక్రయించడం జరిగిందాని, మిగిలిన భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పించనున్నామని వెల్లడించారు.

కొండ పైకి భక్తులను తరలించడానికి 100 ప్రత్యేక బస్సులను ఉచితంగా ఏర్పాటు చేశామన్నారు . ప్రైవేట్ వాహనాలను కొండ పైకి అనుమతించమని. భక్తులు తమ వాహనాలను ఫుట్ హిల్స్ వద్ద కేటాయించిన 32 పార్కింగ్ ప్రదేశాలలో నిలిపివేసి, దేవస్థానం బస్సుల ద్వారా కొండ పైకి చేరుకోవాలని కోరారు.

# డ్రగ్స్ నియంత్రణలో యువత భాగస్వామ్యం ఆవశ్యం

● సిపి శంకరబ్రత బాగ్చీ

**విశాఖపట్నం: మనం న్యూస్: ఏప్రిల్ 18:** మాదకద్రవ్యాల బారిన పడి యువశక్తి నిర్వీర్యం అవుతుందని, వాటిని నియంత్రించడంలో యువత భాగస్వామ్యం అవుసరమని విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనర్ శంకరబ్రత బాగ్చి అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో వైబ్రేంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు విజయ్ కలాం చేపట్టిన దండిమార్చ్ 2.0 మాదకద్రవ్యాల నియంత్రణ అవగాహనా సైకిల్ ర్యాలీ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి కీలకమైన యువశక్తిని కాపాడుకోవాలని,అందులో



యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఏపి అద్యక్షుడు మమ్ముల తిరుపతిరావు మాట్లాడుతూ యువతకు అవగాహన కల్పిస్తూ, వారిని చైతన్యపర్చడానికి విజయ్ కలాం దండి మార్చ్ 2.0 పేరిట సైకిల్ ర్యాలీ చేపట్టారని,ఈనెల 6న తిరుపతి యస్వీ విశ్వ విద్యాలయంలో ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా 25 విశ్వవిద్యాలయాలను సందర్శిస్తూ,ఈనెల22న విశాఖపట్నం ఆంధ్రా విశ్వ విద్యాలయంకు చేరుకుంటుందని, అనంతరం అంబేద్కర్ ఆడిటోరియంలో ముగింపు సమావేశం నిర్వహిస్తున్నామని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కమిషనర్ ను ఆహ్వానించారు. ప్రోగ్రాం రీజినల్ కో ఆర్డినేటర్ లోపింటి జయరాజు, జిల్లా కో ఆర్డినేటర్ నాగిరెడ్డి జగన్మోహిని,విశాఖపట్నం సౌత్, గాజువాక నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు జయలక్ష్మి, ధనుంజయ్ పాల్గొన్నారు.

# విశాఖలో హైకోర్టు న్యాయమూర్తుల అతిథి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన

### వేద మంత్రోచ్ఛరణలు, శాస్త్రోక్త పూజల నడుమ భూమి పూజ చేసిన సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

### క్రతువులో భాగస్వామ్యమైన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హారి, జస్టిస్ రవి చీమలపాటి

**విశాఖపట్టణం, ఏప్రిల్ 18 :** విశాఖపట్టణంలోని ఎండాడ పరిధిలో ఐదెకరాల స్థలంలో నిర్మించతలపెట్టిన హైకోర్టు న్యాయమూర్తుల అతిథి గృహ నిర్మాణాలకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శనివారం శంకుస్థాపన చేశారు. వేద మంత్రోచ్ఛరణలు, శాస్త్రోక్త పూజల నడుమ సహచర న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హారి, జస్టిస్ రవి చీమలపాటిలతో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం మీట నొక్కి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సహచర న్యాయమూర్తులతో పాటు గునపం పట్టుకొని, సిమెంట్ వేసి నిర్మాణాలకు అంకురార్పణ చేశారు. ఇతర పూజా క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భూమిపూజ చేసిన ప్రాంతం నుంచి సాగర తీరాన్ని వీక్షించారు. కొండపై భాగం నుంచి కనిపించే పరిసరాలను పరిశీలించారు. నిర్మాణ ప్రక్రియలు, ఇతర అంశాలకు సంబంధించిన ప్రాథమిక వివరాలను కోర్టు, జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు, ఫస్ట్ ఏడీజే వెంకటరమణ, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, ఇతర న్యాయమూర్తులు, కోర్టు అధికారులు, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

#### హైకోర్టు న్యాయమూర్తులకు ఆత్మీయ సత్కారం

శంకుస్థాపన క్రతువు అనంతరం కొండ దిగువ భాగంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు హైకోర్టు న్యాయమూర్తులు చేరుకున్నారు. జిల్లా కోర్టులో పని చేసే న్యాయమూర్తులు, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఇతర అధికారులతో ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. జిల్లాకు చెందిన న్యాయమూర్తులు, అధికారులతో వారు బృంద చిత్రాలు దిగారు. ఈ క్రమంలో ప్రధాన న్యాయమూర్తిని, ఇతర న్యాయమూర్తులను జిల్లా కోర్టు



న్యాయమూర్తులు, అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆత్మీయంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

